రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అతి స్వల్ప కాలంలోనే అత్యధిక మంది పాఠకుల మన్ననలు పొందుతూ ముందుకు దూసుకెళ్తున్న క్విక్ టుడే దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

EDITOR: G.BUCHI REDDY 8125972476

quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక

క్విక్ టుడే దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

8125972476

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 187 | సోమవారం | 06-04- 2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8

MALKAJGIRI | Volume: 3 | Issue: 187 | Monday | 06-04- 2026 | Price: ₹3/- | Pages: 8

# దేశంలో అత్యుత్తమంగా హైకోర్టు నిర్మాణం



## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

## హైకోర్టు జోన్-II నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

## 100 ఎకరా హైకోర్టు సముదాయాలు నిర్మించడం సంతోషంగా ఉంది

## 2027 డిసెంబర్ నాటికి హైకోర్టు నిర్మాణాలను పూర్తి చేస్తాం

## రాజేంద్రనగర్ లో హైకోర్టు శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్, ఏప్రిల్5 (క్విక్ టుడే న్యూస్):**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న హైకోర్టు నిర్మాణం దేశంలో అత్యుత్తమంగా నిలిచిపోనుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-II నూతన భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి ఎస్ నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్ వెంకటనారాయణ భట్టి, జస్టిస్ అలోక్ ఆరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తో పాటు ఇతర న్యాయకోవిదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లో హైకోర్టు జోన్-2 భవన నిర్మాణాలు గొప్పగా నిలిచిపోతాయని, ఈ హైకోర్టు నిర్మాణం దేశంలో అత్యుత్తమంగా నిలుస్తుందని అన్నారు. జోన్-2 తన మనసుకు చాలా నచ్చిందని, హైకోర్టు జోన్-2 కోసం 100 ఎకరాలు కేటాయించడం సంతోషం అని హైకోర్టు నిర్మాణ పనులు చేపడుతున్న ప్రభుత్వానికి సిజెఐ అభినందనలు తెలియజేశారు. దాదాపు 23 ఏళ్ల సుదీర్ఘ కాలంగా న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్నానని, ఇప్పటికే హై కోర్టు జోన్-1 భవన కాంప్లెక్స్ నిర్మాణంలో ఉందని అన్నారు. ఇప్పుడున్న హైకోర్టు ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదని, జడ్జిల నివాస సముదాయాల్లో కార్యకలాపాలు నడుస్తూనే ఉంటాయని అన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2027 డిసెంబర్ నాటికి తెలంగాణ హైకోర్టు నూతన భవన సముదాయాల నిర్మాణాలను పూర్తి చేస్తామని ప్రకటించారు. హైకోర్టు కొత్త భవన సముదాయ నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో 49 కోర్టులు, నివాస భవనాల నిర్మాణ ప్రాజెక్టులను కూడా చేపడుతున్నట్టు చెప్పారు. "ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే హైకోర్టు నూతన భవనం కోసం రాజేంద్రనగర్‌లో 100 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాం. జోన్-1లో ఇప్పటికే ప్రారంభించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. జోన్-2లో నివాస భవనాలకు ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. వీటి నిర్మాణాలను డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది" అని చెప్పారు. "న్యాయవ్యవస్థకు అత్యుత్తమ సౌకర్యాలు అందించడం కార్యనిర్వాహక విభాగం బాధ్యతగా భావిస్తున్నాం. ఇక్కడ నిర్మించబోయే భవనం దేశంలోనే అతిపెద్ద హైకోర్టు సముదాయాల్లో ఒకటిగా మాత్రమే కాకుండా, ఆధునికత, మౌలిక వసతుల పరంగా ఒక ప్రమాణంగా నిలుస్తుంది. "కొత్తగా నిర్మించే హైకోర్టు సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుంది. ఇది పేదలు, బలహీనులు న్యాయం కోసం వచ్చే వారికి వేదికగా నిలుస్తుంది. రాబోయే వంద సంవత్సరాల పాటు పేదలు, బలహీనులు, అణగారిన వర్గాలు న్యాయం కోసం ఈ మందిరానికి వస్తారు. ఈ భవన సముదాయం కేవలం నిర్మాణం కాదు. ఇది మా ప్రభుత్వ ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబం. అన్ని వ్యవస్థలు పరస్పర గౌరవంతో, సహకారంతో పనిచేయాలని మేం విశ్వసిస్తాం. న్యాయవ్యవస్థ పట్ల మా ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ఇస్తుంది" అని ముఖ్యమంత్రి అన్నారు.




# డ్రగ్స్ వద్దు.. మైదానాలు ముద్దు




### యువత క్రీడా మైదానాలను సద్వినియోగం చేసుకోవాలి

### ముల్లిక్ స్మారక ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ ముగింపు

### మైదానంలో మ్యాచ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచిన సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్5 (క్విక్ టుడే న్యూస్):**

దేశంలోని యువత క్రీడా మైదానాలను ఎందుకు వదిలేస్తున్నారన్న అంశం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. యువతను సరైన మార్గంలో పెట్టకపోతే దేశం ప్రమాదకర పరిస్థితులకు నెట్టివేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ గచ్చీబౌలీ స్టేడియంలో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 74వ బోలానాథ్ ముల్లిక్ స్మారక ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2026 ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి



వివిధ విభాగాలకు చెందిన పోలీసు క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. "యువత నెమ్మదిగా క్రీడలకు దూరమవుతున్నారు. క్రీడా మైదానాలను వదిలిపెట్టి యువత తప్పు చేస్తున్నారు. దేశం కోసం ఏమైనా చేయడానికి మనందరం సిద్ధంగా ఉండాలి. యువత సరైన దశలో వెళ్లకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుంది" అని హెచ్చరించారు. "క్రీడాకారులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది. క్రీడాకారులను తయారు చేసి దేశ ప్రతిష్టను నిలబెట్టాలి. యువతను క్రీడల్లో ప్రోత్సహించండి" అని పిలుపునిచ్చారు. "భారత్ ఫుట్‌బాల్ చరిత్రలో హైదరాబాద్ నగరానికి విశేష పేరు ప్రఖ్యాతులున్నాయి. 1950-60 దశకంలో నర్సరీ ఆఫ్ ఇండియన్ ఫుట్‌బాల్‌గా హైదరాబాద్ పేరు గడించింది. దేశంలోనే ఫుట్‌బాల్‌ను అంతగా ఆదరించింది. 1956 ఒలంపిక్స్‌లో ఆడిన ఫుట్‌బాల్ జట్టులో ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన వారే. ఆ క్రమంలో ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వంగా ఉంది. ఈ క్రీడల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చిన పోలీసు విభాగానికి మనస్ఫూర్తిగా అభినందనలు. దేశం నలుమూలల నుంచి ఈ క్రీడల్లో పాల్గొని అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించిన టీమ్‌లకు తెలంగాణ ముఖ్యమంత్రిగా అందరికీ అభినందనలు. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ ఒలింపిక్స్‌లో కనీసం ఒక్క గోల్డ్ మెడల్ కూడా సాధించలేకపోవడం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.

గతంలో ఇదే గచ్చీబౌలీలో ఎన్నో క్రీడలు నిర్వహించాం. గడిచిన కొన్నేళ్లుగా పట్టించుకోలేదు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో మనవాళ్లు ఓడిపోగానే కొద్దిరోజులు చర్చించి ఆ తర్వాత విస్మరిస్తున్నారు. యువత మాదక ద్రవ్యాల వలలో పడి నిర్వీర్యమైపోతోంది. వీరుల భూమి, ఎంతోమంది త్యాగధనులకు కేంద్రమైన పంజాబ్‌లో ఈరోజు మాదకద్రవ్యాల గురించి వినిపిస్తోంది. అందుకే ఆలోచించి తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది.